www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 2 జూన్ 2025

కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈ నెల 2వ తేదీ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంటల కల్లా తప్పక హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

మా ఊరు గుర్తుందా..?

- రోడ్డు సౌకర్యం లేని నాగిరెడ్డిపల్లి ఎస్టీ కాలనీవాసుల ఆవేదన

అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం మండల పరిధిలోని డిఎం. పురం పంచాయతీ మూలకండ్రిగ గ్రామం అనే ఊరు ఒకటి ఉందని గుర్తుందా.. సారూ.. అని అధికారులను, రాజకీయ నాయకులను అక్కడి వాసులు ప్రశ్నిస్తున్నారు. గత 30 సంవత్సరాలగా మూలకండ్రిగ మీదుగా నాగిరెడ్డిపల్లి గిరిజన కాలనీకి రోడ్డు సౌకర్యం లేక అక్కడి కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్, హాస్పిటల్, రైతులు పొలాలకు వెళ్లడానికి కూడా సరైన రోడ్లు లేవు. రోడ్డు కోతలకు గురికావడంతో పిల్లలను బైక్‌లో స్కూల్‌కి తీసుకెళ్లే క్రమంలో పలుమార్లు ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి కింద పడిపోవడం, చిన్న పిల్లల దెబ్బలు తగడం తరచుగా జరుగుతున్నాయని తెలిపారు. గతంతో ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు గిరిజనులకు ఎంతో అభివృద్ధి చేస్తామని చెబుతున్నా ఆచరణలో అది సాధ్యం కావడం లేదని తెలిపారు. మూలకండ్రిగ గ్రామం నుండి దాదాపుగా మూడు కిలోమీటర్లు సరైన మార్గం లేక అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టి రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

రోడ్డుమొత్తం గుంతలమయం

- ఎం.బాలకృష్ణ, నాగిరెడ్డిపల్లి

గుంతలమయంగా ఉన్న రోడ్డు వల్ల ప్రమాదం జరిగితే ఎలా వెళ్లాలి. మా గ్రామంలో పాము కాటుకు గురైనా, అనారోగ్యంగా ఉన్నప్పుడు ఆసుపత్రికి ఇటువంటి రోడ్డపై ప్రయాణించడం మరింత దారుణంగా ఉంటుంది. మేము ఆసుపత్రికి వెళ్లే సమయానికి కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తోంది. జడ్పీ సీఈవో, గిరిజన అభివృద్ధి అధికారులు చొరవ చూపి మాకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలి.

దారి చూపండి..

- ఏ.భాస్కర్, మూలకండ్రిగ

మూడు కిలోమీటర్ల వరకు ఉన్న నాగిరెడ్డిపల్లి ఎస్టీ కాలనీకి దారి ఏర్పాటు చేయాలి. రోడ్డు సౌకర్యం ఉంటే మాకు బిడ్డలను మంచి పాఠశాలలో చేర్పిస్తే చదువుకుంటారు. చాలా గ్రామాలకు ప్రభుత్వాలు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసింది, అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చొరవ చూపి రోడ్డు వేయించాలి.

ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్..!

- కందూరు వారపు సంత

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంతలో కనీస వసతులు లేక ఎండకు వానకు ఇబ్బంది పడుతూ అటు వ్యాపారస్తులు ఇటు వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మూడు చింత చెట్ల కింద నిర్వహించే వారపు సంతకు ప్రతి ఏడాది నిర్వహించే వేలం పాటలలో లక్షల రూపాయల ఆదాయం వస్తూ ఉంది. అయితే వ్యాపారస్తుల కోసం షెడ్ల నిర్మాణం గానీ వినియోగదారుల కోసం వ్యాపారస్తుల కోసం మరుగుదొడ్లు తాగునీటి వసతి లేకపోవడం గమనార్హం. వారపు సంత నిర్వహించే పరిసరాలు కూడా దుర్గంధభరితంగా చెత్తాచెదారంతో ఉండడం వల్ల అటు వ్యాపారస్తులు వినియోగదారులు కూడా ముక్కులు మూసుకుని సంత చేయాల్సి వస్తోంది. కందూరు వారపు సంతకు కందూరు, వల్లిగట్ల, తమ్మినాయుని పల్లి, కామిరెడ్డివారి పల్లి, నెల్లివంద పంచాయతీల నుండి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి కూరగాయలు ఇతర సరుకులు కొనుగోలు చేస్తూ ఉంటారు. వారపు సంత నిర్వహించే ప్రదేశం కూడా విశాలంగా లేకపోవడంతో కందూరు సోమల ప్రధాన రహదారిపై కూడా వ్యాపారస్తులు వ్యాపారాలు చేస్తూ ఉండటంతో రాకపోకలకు కూడా ఇబ్బంది కలుగుతోంది. సర్పంచ్, పంచాయతీ అధికారులు సమస్యను గుర్తించి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యాపారస్తులు ప్రజలు కోరుతున్నారు.

కందూరు వారపు సంతలో ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, ప్రజలు

నేడు పులిగుండు వద్ద యోగాంధ్ర

2 వేల మందితో కార్యక్రమం: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పెనుమూరు మండలం పులిగుండు వద్ద సోమవారం యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా పర్యటకశాఖ అధికారిని ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణపై ఆయుష్ నోడల్ అధికారులు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యాటక ప్రాంతాలలో యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా ఇదివరకే కాణిపాకంలో నిర్వహించడం జరిగిందని, జూన్ 2న పెనుమూరు మండలం పులిగుండు ఆలయ సమీపంలో కార్యక్రమ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని, ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు భాగస్వాములు కావాలని ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.

హస్తకళాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పసుపులేటి హరిప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌కు జనసేన నేత చంద్రశేఖర్ ఆదివారం తిరుపతిలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషిచేసిన హరిప్రసాద్ సేవలను గుర్తించి, ఆయనకు ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించడం శుభ పరిణామమన్నారు. ఇందుకు కారణమైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

సహిత విద్యా సమన్వయ కర్తగా జగ్గు మధు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో సహిత విద్యా సమన్వయ కర్తగా జగ్గు మధు ఆదివారం భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భగా జిల్లా విద్యాశాకాధికారి వరలక్ష్మీని మర్యాద పూర్వంగా కలిశారు. అనంతరం జిల్లా కార్యాలయంలో జగ్గు మధు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ రకాల దివ్యాంగ పిల్లలకు విద్య, సౌకర్యాల కల్పనలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అలాగే భవిత కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. అధికారుల సూచనలు, అందరి సమన్వయంతో ప్రభుత్వం అందించే ప్రతి సౌకర్యాలను దివ్యాంగ పిల్లలకు చేరే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుధాకర్, జగదీష్, మునీర్, ముక్తార్ అహ్మద్, ఈశ్వరయ్య, అఫ్జల్, కృష్ణమూర్తి, రవి, నాగభూషణం, మహబూబ్ బాషా, నూరుద్దీన్,

మొరాయించిన సర్వర్లు..

- సహకరించని ఈపాస్ మిషన్లు..
- వేచి ఉండలేక వెనుతిరిగిన కార్డుదారులు..

ప్రజాశక్తి- సోమల

చౌక దుకాణం వద్ద నిత్యావసర సరుకుల కోసం వేచి ఉన్న జనం

ఎన్‌డియు వాహనాలు రద్దుచేసి చౌక దుకాణాల వద్దే కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఈనెల 1వ తేదీ ఆదివారం నుండి ప్రారంభమైన నిత్యావసర సరుకులు పంపిణీ సర్వర్ సక్రమంగా పనిచేయక మొరాయించడంతో సరుకుల పంపిణీ మండకొండిగా సాగింది. పండుగ వాతావరణంలో ఉదయం 8 గంటల నుండి చౌక దుకాణాలను తెరచి ఉంచి పూజలు నిర్వహించి ప్రజలు నాయకులు అధికారుల సాక్షిగా నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభించారు. కొద్దిసేపు సర్వర్ సక్రమంగా పనిచేసి ఈపాస్ మిషన్లలో వేలిముద్రలను నిర్ధారించుకొని సరుకుల పంపిణీ సజావుగా సాగింది. ఆ తర్వాత సర్వర్ సమస్యతో పంపిణీలో అవాంతరాలు ఎదురవుతూ నిదానంగా పంపిణీ జరిగింది. ఆ తర్వాత పూర్తిగా సర్వర్ పని చేయకపోవడంతో చేసేదేమీ లేక నిత్యావసర సరుకుల కోసం వచ్చిన కార్డుదారులు వెనుతిరిగి ఇండ్లకు వెళ్లిపోయారు. తిరిగి సాయంత్రం 4గంటలకు ప్రారంభమైన నిత్యావసర సరుకులు పంపిణీ సర్వర్ సమస్యలు నెట్వర్క్ అందకపోవడం తదితర కారణాలతో సజావుగా జరగలేదు. కాగా మండలంలోని కొన్ని చౌక దుకాణాలను తహశీల్దార్ బెన్నురాజ్ తనిఖీ నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని వీఆర్వో ఆథరైజేషన్ ద్వారా ఈపాస్ మిషన్లు ఓపెన్ కావాల్సి ఉండగా అవి కూడా కాస్త ఇబ్బందులకు గురిచేశాయి. ఏది ఏమైనా మొదటి రోజు పండుగ వాతావరణంలో నిర్వహించిన చౌక దుకాణాల నిత్యావసర సరుకులు పంపిణీ సరుకులు తీసుకున్న వారు సంతోషంగానూ తీసుకొని వారు నిరుత్సాహంగానూ ఇండ్లకు నడక సాగించారు.

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్డుదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు ఈనెల 1వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీ చేపట్టడం జరిగిందని చుడా చైర్ పర్సన్ కటారి హేమలత తెలిపారు. ఆదివారం చిత్తూరు పట్టణం, కాజూరు సర్కిల్ 20వ డివిజన్‌లో రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ పునః ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా చూడ చైర్ పర్సన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పౌర సరఫరాల శాఖ అధికారి శంకరన్, చిత్తూరు మండల రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి కార్డుదారులకు సరుకులను అందజేశారు.

కుప్పం రూరల్ : కుప్పం మండలం చెక్కునత్తం పంచాయితీ పరిధిలో రేషన్ షాపులను తెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీ వాహనాల వల్ల పేద ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలో రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. అయితే వయోవృద్ధులకు, ప్రత్యేక ప్రతిభావంతులకు మాత్రం డీలర్లే స్వయంగా వారి ఇంటి వద్దకు రేషన్ అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.యూనిట్ ఇంచార్జి కనకరాజు, పార్టీ అధ్యక్షులు బీరప్ప, మునిరత్నం, తిమ్మప్ప, బాలు, గణేష్, మాదేశ్, డీలర్లు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 7, 8 వార్డుల పరిధిలోని చౌక ధరల దుకాణంలో ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం కార్డుదారులకు సురుకులు పంపిణీ చేశారు. రేషన్ డీలర్లు తమ షాపుల వద్ద లబ్ధిదారులకు మంచినీరు, నీడ ఏర్పాటు చేయాలని తహశీల్దారు చిట్టిబాబు సూచించారు. పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజు పాల్గొన్నారు.

పూతలపట్టు: తవణంపల్లె మండలం, ముత్తరపల్లె గ్రామంలో పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ రేషన్ షాపు సరుకుల పంపిణీని ప్రారంభించారు. ముత్తరపల్లె గ్రామంలో రేషన్ షాపులో సామాన్య ప్రజలకు బియ్యం పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో 65 ఏళ్ళు పైబడిన వృద్దులు, వికలాంగుల ఇంటికి వెళ్ళి ఎమ్మెల్యే స్వయంగా బియ్యం అందజేశారు. తవణంపల్లి తహసీల్దారు సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మండల టిడిపి అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు గ్రామంలో ఆదివారం మాజీ జెడ్పిటిసి సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి చౌక దుకాణాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను అందజేశారు. డీలర్ లలిత కుమారి, వీఆర్వో సాంబశివరెడ్డి, వీఆర్ఏ హేమ శేఖర్ పాల్గొన్నారు.

రొంపిచర్ల: రొంపిచర్ల పెద్ద మసీదు వీధిలోని చౌక దుకాణాన్ని పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ప్రారంభించారు. లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తహశీల్దారు పి.కిరణ్ కుమార్, మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఇబ్రహీం ఖాన్ పాల్గొన్నారు. పులిచెర్ల మండలంలో తహశీల్దారు జయసింహ ఆధ్వర్యంలో చౌక దుకాణాలు ప్రారంభమయ్యాయి. మండల నాయకులు లెక్కల ధనుంజయ నాయుడు, సిహెచ్ కుమార్ రెడ్డి, గోపి నాయుడు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని జంబువారిపల్లి పంచాయతీ దండువారిపల్లిలో నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం డీలర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆర్డీవో భవాని, తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, సర్పంచ్ అమరమ్మ, ఉప సర్పంచ్ కమలనాథరెడ్డి వీఆర్వో గోవిందయ్య పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని రేషన్‌షాపును తహశీల్దార్ ప్రసన్న కుమార్, మండల టిడిపి మాజీ అధ్యక్షులు బిఎస్.కుమార్, డీలర్ రవి కుమార్ బాబు ప్రారంభించి కార్డుదారులకు సరుకులు పంపిణీ చేశారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పూతలపట్టు: తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగారపు గోపి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును ఆదివారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. ఎస్‌వి సెట్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో ఎమ్మెల్యే టాస్ వేసి మొదటి మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని, కాసేపు బ్యాటింగ్ చేసి నిర్వహుకులను ఉత్సాహ పరిచారు. క్రీడల వల్ల స్నేహసంబంధాలు పెరిగి ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా మళ్లీ గెలిచేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, మండల టిడిపి అధ్యక్షులు దొరబాబు చౌదరి, తవణంపల్లె మండల క్లస్టర్ ఇంఛార్జ్ మోహన్ నాయుడు పాల్గొన్నారు.

సోనుసూద్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రముఖనటుడు, గొప్ప ఉదారస్వభావి, సమాజ సేవకుడు, ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలిచిన సినీ నటుడు సోనుసూద్‌ను ఆదివారం ఉదయం రేణిగుంట ఎయిర్పోర్టులో నాయుడుపేట యువ నాయకులు నెలవల రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అయనకు జ్ఞాపికను అందజేసి, శాలువాలతో పూలమాలలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉన్న ప్రత్యేకతలు తెలియజేసి సూళ్లూరుపేట పట్టణంలో ప్రముఖ ఆలయమైన చెంగా లమ్మ ఆలయాన్ని, వేనాడు దర్గాని, షార్‌ను అలాగే సుళ్ళూరుపేట నియోజక వర్గాన్ని సందర్శించాలని ఆహ్వానించారు. ఆయన సేవలు సూళ్లూరుపేట నియోజకవర్గం ప్రజలకు కూడా ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

సోను సూద్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఆహ్వానం పలుకుతున్న నెలవల రాజేష్, రఫి

కూలడానికి సిద్ధంగా ఓవర్ హెడ్ ట్యాంక్..

- పునాదులలో లోపం
- ట్యాంకులో నీరు నింపితే ప్రమాదం

ప్రజాశక్తి - సోమల

మండల కేంద్రమైన సోమల ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం 10 సంవత్సరాల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ పునాదులు, పిల్లర్స్ నాణ్యతగా నిర్మించకపోవడంతో ట్యాంకులో నీరు నింపగానే కూలిపోయే ప్రమాదం ఉందని నిర్మించినప్పటి నుండి నిరుపయోగంగా వదిలేశారు. లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లోపం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించకపోవడం వంటి కారణాలతో నాసిరకంగా నిర్మాణం జరిగింది. ప్రజల కోసం ప్రజల డబ్బుతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ వాడుకలోకి రాకుండానే కూల్చివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వాటర్ ట్యాంకు పైకి ఎక్కడానికి నిర్మించిన నిచ్చెన ఆసరా ప్లేట్లు కూడా పడిపోయే విధంగా వేలాడుతూ కేవలం కమ్ముల పట్టుతో నిలిచి ఉన్నాయి. ట్యాంకు చుట్టూ నివాస గృహాలు ఉండడంతో కూల్చివేయాలంటే పూర్తిస్థాయిలో తగిన జాగ్రత్తలు తీసుకొని కూల్చివేయాల్సిన పరిస్థితి ఉందని అధికారులు అంటున్నారు. ఏది ఏమైనా మరింత శిథిలావస్థకు చేరుకుని ట్యాంకు కూలిపోయే లోపు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులే కూల్చివేసే ప్రక్రియను తీసుకొని అదే స్థానంలో మరొక ఓవర్ హెడ్ ట్యాంక్ నాణ్యతగా నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.

చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ

ఇంటర్వ్యూ

ఎలాంటి ఇబ్బందులు ఉండవు..

శంకరన్, జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు చౌక దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని పౌర సరఫరాలశాఖ అధికారి శంకరన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రారంభమైన చౌక దుకాణాల్లో బియ్యం, రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగింది. గతంలో ఇంటింటికీ బియ్యం పంపిణీ రద్దు చేయడం వల్ల బియ్యం కార్డుదారులు సమీపంలోని చౌక దుకాణాల్లో ప్రభుత్వం అందించే సబ్సిడీ బియ్యం, కందిపప్పు, పామాయిల్, చక్కెర పొందవచ్చు. సమీపంలోని ఏ చౌక దుకాణంలో అయినా నిత్యావసర సరుకులు తీసుకునే అవకాశం ఉంటుంది.

ప్రజాశక్తి: జిల్లాలో తెల్ల రేషన్ కార్డులు ఎన్ని ఉన్నాయి..?

పౌర సరఫరాల శాఖ అధికారి : జిల్లా వ్యాప్తంగా 11 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. 248 చౌక దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతోంది. వాహనాల ద్వారా పంపిణీ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో గతంలో లానే చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రజాశక్తి: చౌక దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ ఎలా.?

పౌర సరఫరాల శాఖ అధికారి : జిల్లాలోని చౌక దుకాణాల్లో ప్రతినెలా ఒకటవ తేదీ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు అందుబాటులో ఉండి ప్రతి ఒక్కరికి సరుకులు అందిస్తారు. దివ్యాంగులు, వయసు పై పడినవారికి మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారి ఇంటి వద్దనే నిత్యావసర సరుకులు అందించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటివరకు ఇంటింటికి పంపిణీ చేస్తున్న వాహనాలను ఉపయోగిస్తున్నాం. ఇంటి వద్దనే బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రం సేకరించి సరుకులను పంపిణీ చేయడం జరుగుతుంది.

ప్రజాశక్తి: చౌక దుకాణం డీలర్ల నిబంధనలేమిటి...?

పౌర సరఫరాల శాఖ అధికారి : చౌక దుకాణం డీలర్లు ప్రభుత్వం నుండి అందిస్తున్న నిత్యావసర వస్తువుల సరుకుల జాబితాను చౌక దుకాణం ముందు డిస్ప్లే బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రతినెలా ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు చౌక దుకాణం పరిధిలోని బియ్యం కార్డు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఉదయం 8 నుండి 12 గంటల వరకు సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు దుకాణాల్లో అందుబాటులో ఉండి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది.

ప్రజాశక్తి: ఆయా చౌకదుకాణాల పరిధిలోని లబ్ధిదారులు అక్కడే సరుకులు తీసుకోవాలా..?

పౌర సరఫరాల శాఖ అధికారి : అలాంటి నిబంధనలు ఏమీ లేవు. ఆన్లైన్ విధానం కాబట్టి సమీపంలోని చౌక దుకాణంలో కూడా నిత్యావసర వస్తువులు పొందవచ్చు.

శిక్షణ పొందుతున్న మహిళలు

మహిళల చేతివృత్తులకు ప్రోత్సాహం

టైలరింగ్‌లో నైపుణ్యతపై శిక్షణ

మాట్లాడుతున్న ఎంపిడివో మహేష్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: నిరుద్యోగ మహిళ లకు చేతివృత్తుల ద్వారా జీవ నోపాధి కల్పిం చేందుకు కుట్టుమిషన్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహి స్తున్నా మని ఎంపీడీవో మహేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మహిళలకు 90 రోజుల పాటు కుట్టుమిషన్లతో టైలరింగ్, ఎంబ్రాయి డరింగ్‌లో శిక్షణ ఇస్తున్నా రన్నారు. ఇందుకోసం కుట్టుమిషన్లను మండల కార్యాలయంలో ఏర్పాటు చేశామని, ఆసక్తి కలిగిన మహిళలు మండలంలో పేరు నమోదు చేసుకుని ఎంపిక చేసి శిక్షణకు అవకాశం కల్పించామని తెలిపారు. 90 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ పొందిన వారికి మాత్రమే ఉచితంగా కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందిస్తారని శిక్షణలో గైర్హాజరైతే ఉచిత కుట్టుమిషన్లకు అర్హత కోల్పోతారని, ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో సూచించారు.

హరికథను తిలకిస్తున్న భక్తులు

ఆకట్టుకుంటున్న హరికథ

ప్రజాశక్తి -సోమల:

సోమల, ఇరికిపెంట పంచాయతీ పరిధిలో భారత మిట్ట మహా భారత యజ్ఞంలో ప్రతి రోజూ మధ్యాహ్నం నిర్వ హిస్తున్న హరికథా కాలక్షేపం ప్రజలను ఆకట్టుకుంటోంది. హరికథ భాగవతారిణి నాగ రత్న తన గానామృతంతో కథ వినడానికి వచ్చే వారికి అర్థమయ్యేలా హరికథ చెబుతుండడంతో కథ వినడానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారు. పక్క వాయిద్యాలుగా తబలా డమరేశ్, హార్మోనియం సురేష్, వయోలిన్ దేవా అందిస్తున్నారు. ఆదివారం కర్ణుడి జననం హరికథ గానం చేశారు.

చౌక దుకాణాలు ప్రారంభం

ప్రజాశక్తి - గంగవరం:

మండలంలోని అన్ని పంచాయతీలలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని ఆదివారం నిర్వహించారు. ఇకపై ప్రతి నెలా 15 రోజుల పాటు తెల్లవారి, సాయంత్రం డీలర్లు అందుబాటులో ఉంటారని బియ్యంతో పాటు నిత్యవసర వస్తువులు కూడా స్టోర్లలో అందుబాటులో ఉంటారన్నారు.

4న నిరసనను విజయవంతం చేయండి

'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణలో మాజీ డిప్యూటీ సీఎం పిలుపు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల నాలుగవ తేదీ నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పిలుపునిచ్చారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట దీపిక కల్యాణ మండపంలో వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నియోజకవర్గ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు మామను, రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిన ఏకైక వ్యక్తి చంద్రబాబు అని, రాష్ట్ర మహిళలను, విద్యార్థులను, శ్రామికులను, రైతులను అన్ని వర్గాల ప్రజలను సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు మోసం చేశారని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఎక్కడ లేని హామీలు ఇచ్చి వాటిని గాలికి వదిలేసి చంద్రబాబు చేసిన మోసాలు, అరాచ కాలు, అన్యాయాలు, దౌర్జ న్యా లను నిరసిస్తూ వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రాలలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి నియోజక వర్గంలోని అన్ని మండలాల ప్రజా ప్రతి నిధులు, వివిధ హోదాలలో పార్టీ నాయ కులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు గురవారెడ్డి, నాయకులు రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు మణి, జనార్ధన్, హరి రెడ్డి, నియోజకవర్గ యువత అధ్యక్షులు కిషోర్ రెడ్డి, యువ నాయకులు శ్యామ్, కుప్పయ్య, చంద్రగిరి కాలప్ప, మణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం కె నారాయణస్వామి

నేడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మాట్లాడుతున్న కడా పీడీ మరమ్మత్

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని మండ ల అభివృద్ధి కార్యా లయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించ నున్నామని కడా పీడీ వికాస్ మరమ్మత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడానికి వీలు కల్పిస్తూ ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వాధికారులు నిర్వహిస్తున్నా రన్నారు. ఈ మాసంలో కుప్పం పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తిరుపతి గంగమాంబ జాతర, ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ప్రజా సమస్యల పరిష్కార వేదికను అధికారులు రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జూన్ 2వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గంగమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు గంటా ఊరు కాలనీలో శనివారం రాత్రి తిరుపతి గంగమ్మ జాతర శిరస్సు ఊరేగింపుతో ప్రారంభమై ఆదివారం ఉదయం నుండి అమ్మవారి విశ్వరూప సందర్శన నిర్వహించారు. పలమనేరు నియోజకవర్గ పరిధిలోని ప్రజలు అమ్మవారి నిజరూప దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం ఉదయం అమ్మవారి నిమజ్జనం, గంగ జాతర ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకయ్య గౌడ్ మారెమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగన్ తన సొంత డబ్బులు వెచ్చించి ఆలయ నిర్మాణానికి అభివృద్ధికి ఎంతో సహాయం చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. వర్షాలు బాగా కురిసి ప్రజలు సుఖ సంతోషాలతో వుండాలని కోరుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ మురుగన్, డైరెక్టర్లు ఆయనను ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ మురుగన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఎంను సన్మానిస్తున్న యాజమాన్య కమిటీ ఛైర్మన్

హెచ్ఎం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:

గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం జెడ్‌పి హైస్కూలు ప్రధానోపాధ్యా యులుగా రాజేంద్ర నాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమా న్య కమిటీ ఛైర్మన్ సుధాకర్ ఉపాధ్యాయులతో కలిసి ప్రధానోపా ధ్యాయులకు శాలువా కప్పి ఆయనకు పూల బొకే అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర నాయుడు మాట్లా డుతూ ఈ పాఠశాలలోనే విద్యార్థిగా, ఇదే స్కూల్లో స్కూల్ అసి స్టెంట్‌గా, ఎఫ్ ఏసి హెచ్ఎం గా పనిచేసి ఉద్యోగోన్నతి పొంది గ్రేడ్ 2 ప్రధానోపాధ్యా యు లుగా రావ డం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు దేవరాజులు, గుణశేఖర్ నాయుడు, వెంకటరమణ నాయు డు, సూర్యకుమారి, చంద్రమ నాయుడు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వున్న శానిటరీ కాంప్లెక్స్

కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిరుపయోగం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద సచివాలయ సిబ్బంది సౌకర్యార్థం నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిరుపయోగంగా వుంది. ఆరు లక్షల రూపాయలతో బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు నిర్మించి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఉపయోగంలోకి తీసుకురాలేదు. నీటి నిల్వ కోసం భూ గర్భ ట్యాంకు కూడా నిర్మించారు. అధికారులు సమస్యను పరిశీలించి శానిటరీ కమ్యూనిటీ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం వుంది.

బైరెడ్డిపల్లికి 1313.1 క్వింటాళ్ల వేరుశనగ

-30 కేజీల బస్తా రూ.1,674 - 4 న పంపిణీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:

ఖరీఫ్-2025 సీజన్‌కు సంబంధించి బైరెడ్డిపల్లి మండలానికి 1313.1 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు కేటాయించారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలలో క్వింటాళ్ల విత్తనాన్ని అందుబాటులో వుంచారు. ఈ నెల 4వ తేదీ వీటిని పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక కేజీ వేరుశనగ కె-6రకం పూర్తి ధర 93 రూ. కాగా రాయితీ 37.20 రూపాయలు పోను రైతు 55.80 రూపాయలు చెల్లించాల్సి వుంది. ఒక బస్తా 30 కేజీలు పూర్తి ధర 2,790 రూపాయలు కాగా రాయితీ 1,116 రూపాయలు పోను 1,674 రూపాయలు రైతు చెల్లించాల్సి వుంది. జూన్ 4వ తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాలలో విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి వుంది. దీనికి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ అయిన మొబైల్ నెంబరు రైతు తీసుకురావాల్సి వుంది. ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వనున్నారు. తీసుకున్న ప్రతి రతై వేరుశెనగ పంట తప్పని సరిగా సాగు చేస్తామని ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు తీసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా పొలంలో వేసి వేరుశనగ సాగు విస్తీర్ణం పెరిగేలా సహకరించి మండలంలో సాగుశాతం పెంచి అభివృద్ధికి తోడ్పడాలని రైతులను మండల ఏవో గీతాకుమారి కోరారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇళ్ల స్థలాల కోసం నేడు ధర్నా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ చిత్తూరులో నేడు సోమవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ నగర సమితి కార్యదర్శి గోపీనాథ్ కోరారు. ధర్నాకు సంబంధించిన మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గోడపత్రికలను సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా లో వేలాది మంది నిరుపేదలకు ఉండడానికి ఇళ్లు లేక బాడుగ ఇళ్లలో నివసిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న నిరుపేదల అర్జీలను పరిశీలించి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో ఇళు లేని వారందరికీ ఇళ్లు ఇస్తామని ప్రకటించిన మాటను నిలబెట్టుకోవాలని సూచించారు. నిరుపేదకు కులమతాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎంగా మర్రి శేఖర్

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా మర్రిశేఖర్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శాంతిపురం మండలం శోగడ బల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి కార్వేటి నగరానికి ఆయన బదిలీపై వచ్చారు. కార్వేటినగరంలో హెచ్ఎంగా పనిచేస్తున్న గాయత్రి దేవి చింతల పట్టెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన హెచ్ఎం మర్రిశేఖర్ మాట్లాడుతూ బాలికల ఉన్నత పాఠశాల ఉత్తీర్ణత శాతం పెంచడానికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భం గా ఎస్‌టియు రాష్ట్ర నాయకుడు గాజుల నాగేశ్వరరావు, జిల్లా ఎస్టియు సభ్యులు మర్రి ముని రాజాలు శాలువా కప్పి సత్కరిం చారు. అదే పాఠశాలలో పని చేస్తున్న వేణుగోపాల్ అభి నందనలు తెలిపారు.



మర్రిశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దుస్థితిలో పశు వైద్యశాల

- శిథిలావస్థలో కూలేందుకు సిద్ధం
- బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- శాంతిపురం : మండల కేంద్రంలోని పశువైద్యశాల దుస్థితికి చేరుకుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం వర్షాలకు ఉరుస్తూ కూలేందుకు సిద్ధంగా వుంది. వైద్యం కోసం వచ్చే పశువులకు సరైన సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పశువులకు వైద్యం అందించడానికి ఏర్పాటుచేసిన షెడ్డు పైకప్పు రేకులన్నీ పగిలిపోయి ఇబ్బందికరంగా మారాయి. దీంతో వైద్యం కోసం వచ్చే పశు వులు ఎండకి ఎండుతూ, వానకు తడుస్తూ వైద్యం అందించాల్సి వస్తోంది. ఏ ఆసుపత్రి భవనానికి వున్న గోడలన్నీ బీటలు వారి ఎప్పుడు కూలిపోతుందో అన్న భయంతో ఈ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో పశువుల కోసం ఏర్పాటుచేసిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి పశువైద్యశాలకు మరమ్మతులు చేసి పాడి రైతులకు అందుబాటులోకి తీసుకురావాల్సి వుంది.

గోడలు బీటలు వారి ప్రమాదకరంగా మారిన దృశ్యం

పశువైద్యశాలలో నిరుయోగంగా వున్న నీటి తొట్టెలు

ముగిసిన మహాభారత ఉత్సవాలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలంలోని తయ్యూరు అంకనపల్లి ద్రౌపది సమేత ధర్మరాజుల మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధ ఘట్టం తో ముగిశాయి. భీముడిగా అశోక్, దుర్యోధ నుడిగా తారక్ వేషధారణ చేసి పద్యాలు, పాటలు పాడుతూ జనాన్ని ఆకర్షించారు. మడుగులో దాగిన దుర్యోధనుడు ని భీముడు లాగి మట్టితో చేసిన బొమ్మపైకి తీసుకురావడం తొడలు విడిచి వధించడం కళ్లకు కట్టినట్టుగా పాత్రధారులు చూపించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారుగా అంకన పల్లె ఆది ఆంధ్రవాడ ప్రజలు వ్యవహరించారు. మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నల్లపల్లి గ్రామానికి చెందిన వారు అన్నదానం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు కార్తీక్ వేదమంత్రోచ్ఛారణ మధ్య ధర్మరాజులు పట్టాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ లింగారెడ్డి, ఆలయ నిర్వాహకులు రామనాథరెడ్డి, లోకనాథ్ రెడ్డి, డిసెంబర్ శెట్టి, చంద్రశేఖర్ రెడ్డి, పురుషోత్తం శెట్టి, గోవిందస్వామి నాయుడు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

ఆకట్టుకుంటున్న దుర్యోధన వధ ఘట్టం

పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసులు

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు: సీఐ

ప్రజాశక్తి -బంగారుపాలెం: మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం మండలంలో తనిఖీలలో భాగంగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ పట్టుబడ్డారు. వారి తల్లిదండ్రులకు పిలిపించి వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని వారికి వాహనాలు ఇచ్చినందుకు తల్లిదండ్రులకు కూడా శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గౌరీ శంకర్, కానిస్టేబుల్ కిరణ్ పాల్గొన్నారు.

రేషన్ షాపులు ప్రారంభిస్తున్న ఆర్‌డివో

రేషన్ షాపులు ప్రారంభించిన ఆర్‌డివో

ప్రజాశక్తి-పలమనేరు: చిత్తూరు జిల్లాలో పలమనేరులో. మొట్ట మొదటగా పాతపేటలోని రేషన్ షాప్ నంబర్ 2 ను ఆదివారం ఉదయం 9 గంటలకు పలమనేరు ఆర్డీవో భవాని, పలమనేరు తహశీల్దారు ఇన్బనాథన్ ఆదివారం ప్రారంభించారు. ఈ రేషన్ షాపుల ప్రారంభోత్సవ ఒక పండగ వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా ఆర్డీవో భవాని మాట్లాడుతూ నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలను నివారించేందుకు రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పట్టణ కన్వీనర్ గిరి ఎస్సీ నాయకుడు నాగరాజు కౌన్సిలర్ విఆర్సి కుమార్ పాల్గొన్నారు.

పలమనేరు రూరల్ మండలం మండిపేట కోటూరులో ఓసి కాలనీ లో రేషన్ షాప్ టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ జగదీష్ నాయుడు, మూర్తి నాయుడు , చంద్రబాబు యాదవ్, దాము నాయుడు, గోపాల్ నాయుడు, బాలాజీ గౌడ్, బాలాజీ పాల్గొన్నారు.

మండిపేట కోటూరులో ఓసి కాలనీ లో రేషన్ షాప్ టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ జగదీష్ నాయుడు, మూర్తి నాయుడు , చంద్రబాబు యాదవ్, దాము నాయుడు, గోపాల్ నాయుడు, బాలాజీ గౌడ్, పాల్గొన్నారు.

గ్రేడ్ 2 హెడ్మాస్టర్లుగా నలుగురికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

మున్సిపల్ కార్పొరేషన్‌లోని హైస్కూళ్ళకు 30వ తారీకు జరిగిన పదోన్నతుల ప్రక్రియలో భాగంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాలుగు పాఠశాలలకు గ్రేడ్ 2 హెడ్మాస్టర్లుగా పదోన్నతి పొందివారు ఆదివారం నూతన పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతి పొందిన వారిలో మురుగన్, రవిచంద్రన్, పరంజ్యోతి, పరంధామనాయుడులను పాఠశాలల ఉపాధ్యాయులు, యుటిఎఫ్, ఎస్‌టియు, ఏంటీఎఫ్ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బండి మధుసూదన రెడ్డి, ఎద్దల హేమాద్రి బాబు, పసపల గోపాల్, ఎస్టియు నాయకులు, ధనంజయులు నాయుడు, పి రేణుకాదేవి, యం టి ఎఫ్ నాయకులు కదిరి రవి, మురళీమోహన్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత విశ్వవిద్యాలయంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ :

యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత విశ్వవిద్యాలయాల సంఘం, విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు, ఫిట్‌నెస్, స్థిరత్వం, సమాజ స్ఫూర్తిని ప్రోత్సహించడానికి విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఆదివారం ఉదయం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని సైకిల్‌పై ఆదివారాల ప్రత్యేక ఎడిషన్‌తో జరుపుకుంది. వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి నేతృత్వంలో విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఫిట్ ఇండియా ప్రతిజ్ఞతో కార్యక్రమం నిర్వహించారు. క్యాంపస్‌లో రెండు ల్యాప్‌లలో 2 కి.మీ. దూరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్రీడల కార్యదర్శి సేతురాం యూనిట్ 4 సహకారంతో నాయకత్వం వహించారు. 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు ఇండియన్ యూనివర్సిటీస్ అసోసియేషన్, జాయింట్ సెక్రటరీ, ప్రపంచ సైకిల్ దినోత్సవ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బల్జిత్ సింగ్ షెకాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'వెన్నుపోటు దినం' నాటకం ఎవరి కోసం?: టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి - క్యాంపస్ :

జూన్ 4వ తేదీన వైసీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం ఎవరికోసమని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టె హేమంత్ రాయల్ ప్రశ్నించారు. జగన్ సొంత బాబాయికి, చెల్లెలికి, తల్లికి చేసింది వెన్నుపోటని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి ప్రణాళికలతో ముందుకెళ తుంటే ఓర్వలేక ఈ నాటకాలాడుతున్నారని మండి పడ్డారు. ఎన్నికల్లో ఘోర పరాజయాలు చేసిన వారు నాటకాలు తెరలేపారన్నారు. ఇకనైనా వైసీపీ నాయకులు వంకర బుద్ధిని మార్చుకోవాలని, లేదంటే రానున్న పంచాయతీ, కార్పొరేషన్ ఎన్నికలలో ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

డాక్టర్ రవిరాజుకు ఎన్‌టిఆర్ అవార్డు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డాక్టర్ రవి రాజు చేసిన సేవలను గుర్తించి సాహిత్య సాంస్కృతిక సేవ ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలలో భాగంగా విజయవాడలో ఎన్టీఆర్ అవార్డు గ్రహీతగా ఎంపిక చేశారు. ఆయన తొలుత కార్వేటినగరం పిహెచ్‌సిలో డాక్టర్‌గా చేరారు. శరీరం మీద పుండ్లతో ఒకరి వెంట ఒకరు గ్రామాల నుంచి ఆసుపత్రికి రావడంతో ఆశ్చర్య పోయిన ఆయన, గ్రామాలకు వెళ్లి ప్రతి ఇల్లు తిరిగి, ఈ వ్యాధికి మూలం చనిపోయిన పశువులను మాంసాన్ని తినడం వల్ల వచ్చిందని గుర్తించి, ఇది ఆంత్రాక్స్ వ్యాధి అని వెలుగులోకి తీసుకొచ్చారు. జిల్లా యంత్రాంగం కదిలి వచ్చి వ్యాధిని అదుపులోకి తీసుకొచ్చారు. తిరుపతి ఏఐఎంఏలో పలు కీలక బాధ్యతలు వహించి, కరోనా సమయంలో జిల్లా అధికారులతో కలిసి చురుకైన పాత్ర పోషించారు. ఆయన పుత్తూరు వాకర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా ఎన్నికై అంచలంచలుగా ఎదిగి నేడు ఇంటర్నేషనల్ అసోసియేషన్‌కు ఎలెక్ట్ అధ్యక్షుడిగా అయినారు. 2026 కు పూర్తిస్థాయి ఇంటర్నే షనల్ అధ్యక్షుడుగా పనిచేయనున్నారు. కుటుంబ పరంగా ఆయన వైద్య సేవలను దగ్గర నుంచి చూసిన ఇద్దరు కుమార్తెలు డాక్టర్లుగా వైద్యరంగంలోకి ప్రవేశించడం విశేషం.